రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియా హాజరవ్వడంలేదు

- ఎఐసిసి కార్యాలయం వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ హాజరుకావడం లేదని ఎఐసిసి సమాచారం ఇచ్చింది. జూన్ నెల 2న నిర్వహించే ఈ వేడుకలకు సోనియాను ఆహ్వానిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆమెను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి లేఖ పంపించింది. కానీ, వేడుకలకు హాజరుకావడం లేదని సోనియా గాంధీ కార్యాలయం నుంచి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు సమాచారం పంపించారు. తన సందేశాన్ని పంపించనున్నట్టు సోనియా కార్యాలయం వెల్లడించింది. స్వరాష్ట్రం ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని సిఎం రేవంత్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు ఆహ్వానించారు. ఆమె ముఖ్యఅతిథిగా వస్తారని కాంగ్రెస్ నేతలు భావించారు. కానీ వేడుకలకు రాలేనంటూ ఆమె లేఖ పంపడం గమనార్హం. వేడుకలకు ఇప్పటికే సిఇసి షరతులతో కూడిన అనుమతినిచ్చింది. దీంతో, సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించేందుకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. అతిథులు ఎండకు గురికాకుండాషామియానాలు ఏర్పాటు చేయనున్నారు. పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు ముందుగా రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కును సందర్శిస్తారు. తెలంగాణ అమరవీరులస్థూపం వద్ద నివాళులర్పిస్తారు.

'పట్ట'ం.. ప్రతిష్టాత్మకం

- నేడు వరంగల్- ఖమ్మం- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్
- 2021తో పోల్చితే తగ్గిన ఓటర్లు, అభ్యర్థులు
- అయినా సవాల్‌గా తీసుకున్న పార్టీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికను అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 2021 మార్చిలో ఈ స్థానానికి ఎన్నిక నిర్వహించగా బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఆయన 2023 నవంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా నెగ్గడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే మూడేళ్ల పదవీకాలం పూర్తవగా.. మరో మూడేళ్ల కాలం ఉంది. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం 12 జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉండడం, పైగా ఇదీ విద్యావంతులు.. అది కూడా పట్టభద్రులు మాత్రమే వేసే ఓటు కావడంతో ఈ ఎన్నిక ఫలితం ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ఈ ఉప ఎన్నికను అధికారపార్టీతో పాటు విపక్షాలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు ముగిసిందే తడువు మంత్రులు, మాజీ మంత్రులు, కేంద్ర మంత్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలోకి దిగారు. హోరాహోరీ ప్రచారం నిర్వహించారు. మొత్తమ్మీద ఈ ఎన్నిక ప్రచారం శనివారంతో ముగిసింది. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.

ఇండియా కూటమి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న..

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐతో కూడిన ఇండియా కూటమి అభ్యర్థిగా చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నను బరిలో దింపాయి. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మల్లన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టించారు. మల్లన్నతో పాటు అప్పటి తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్



కోదండరామ్ గట్టి పోటీనిచ్చారు. ఫలితంగా నాలుగు రోజుల పాటు కౌంటింగ్ సాగింది. చివరకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో రాజేశ్వర్‌రెడ్డి బయటపడ్డారు. గత ఎన్నికల్లో వామపక్షాల అభ్యర్థిగా జయసారథిరెడ్డి పోటీ చేశారు. నాడు కాంగ్రెస్ అభ్యర్థి రామునాయక్ ఐదో స్థానంలో ఉండగా.. ఆరో స్థానంలో జయసారథిరెడ్డి నిలిచారు. ఇప్పుడు కమ్యూనిస్టులు, టిజెఎస్ మద్దతు కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం కలిసి వచ్చే అంశం. గత ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి నాల్గో స్థానంలో నిలిచిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రస్తుతమూ బరిలో ఉన్నారు. బిఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఇదే మొదటి ఎన్నిక.

హోరాహోరీ ప్రచారం

దాదాపు 20 రోజుల పాటు ఈ ఉప ఎన్నిక ప్రచారం కొనసాగగా.. 12 రోజులు మాత్రం ముమ్మరంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ తరపున మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ ప్రచార బాధ్యతలు నిర్వహించారు. బిఆర్ఎస్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్లమెంట్ ఎన్నికల ముందు బిఆర్ఎస్‌లో చేరిన మాజీ ఐపిఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించారు. బిజెపి నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, డికె అరుణ, ఈటల రాజేందర్, లక్ష్మణ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం చేసిన మంత్రులు బిజెపి, బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రధానంగా ప్రస్తావించారు. బిజెపి మతతత్వ విధానాలను ఎండగట్టారు. మద్దతిచ్చిన పార్టీలూ ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాయి. నాడు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి, బిఆర్ఎస్ తనను ఎంతగా ఇబ్బంది పెట్టాయో.. తనపై ఎన్ని అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేశాయో అభ్యర్థి మల్లన్న ప్రజల ముందు ఉంచారు. బిఆర్ఎస్, బిజెపి మాత్రం మల్లన్నను ఓ బ్లాక్‌మెయిలర్‌గా చిత్రీకరించి లబ్ధిపొందాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా చేశాయి.

పోలింగ్ శాతం పెంపుదల దొటే..!

వరుసగా ఎన్నికలు వస్తుండటంతో ఓటర్లు ఒకింత ఇబ్బంది పడుతున్నారు. పైగా పట్టభద్రుల ఓట్లు.. అవి కూడా బ్యాలెట్ ఎన్నికలు కావడం, ప్రాధాన్యత క్రమం ప్రకారం కావడంతో ఓటింగ్ జాప్యం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు ఏ మేరకు కదిలి వచ్చి పోలింగ్‌లో పాల్గొంటారనేది అనుమానంగానే ఉంది. ఇదే స్థానానికి 2021లో జరిగిన ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లుండగా 3,74,117 (73.86%) మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2015లో 49.61% మందే ఓటు వేశారు. 2021లో 5.05 లక్షల మంది ఓటర్లకు 703 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయగా, ఈసారి 4.63 లక్షల మందికి 605 కేంద్రాలను నెలకొల్పారు. 27వ తేదీన ఎంతమంది ఓటు హక్కు వినియోగించుకుంటారో చూడాలి. జూన్ 5న ఈ ఎన్నికల కౌంటింగ్ మొదలవుతుంది.

నిమ్స్ వైద్యులను అభినందించిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛాతీలో బాణం దిగిన ఆదివాసీ యువకుడిని కాపాడిన నిమ్స్ వైద్యులను సిఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రాణాపాయం లేకుండా చాకచక్యంగా బాణాన్ని తొలగించారని ఆదివారం 'ఎక్స్' వేదికగా కితాబిచ్చారు. ప్రజల్లో నిమ్స్‌పై ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేశారన్నారు. భవిష్యత్‌లో నిమ్స్ మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రమాదవశాత్తు ఛాతీలో దిగిన బాణంతో దాదాపు 24 గంటలు విలవిల్లాడుతూ నరకయాతన అనుభవించిన సోది నంద (17) అనే గిరిజన యువకుడికి నిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన సోది నందకు వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తూ బాణం గుచ్చుకుంది. సరిగ్గా గుండె, ఊపిరితిత్తుల మధ్యలో దిగటంతో బాధితుడిని కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి, ఆ తర్వాత వరంగల్ ఎంజిఎంకి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర్‌రావు బృందం దాదాపు నాలుగు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం యువకుడు ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు.



ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రెనోవా సెంచరీ ఆస్పత్రి ఎండి డాక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజు రోజుకు గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని రెనోవా సెంచరీ ఆస్పత్రి ఎండి డాక్టర్ శ్రీధర్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాన్సర్‌తో మహిళలు చిన్న వయస్సులోనే ప్రాణాలను కోల్పోతున్నారని హెచ్చరించారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా... మహిళలు పాప్ స్మియర్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలో క్యాన్సర్‌కు సంబంధించిన కణాలు ఏవైనా గర్భాశయ ముఖద్వారంలో ఉంటే వాటిని గుర్తించి హెచ్చరిస్తుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌ను మమోగ్రాఫ్‌తో గుర్తించవచ్చని తెలిపారు.

నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇంటర్‌మీడియట్ బోర్డు పర్యవేక్షణ లోపం కారణంగా ఇంటర్ పరీక్షల్లో పలువురు విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయనీ, ఇది నిర్లక్ష్యపు మూల్యాంకనం కారణంగానే జరిగిందనీ, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్‌మూర్తి, టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ విద్యార్థికి లాంగ్వేజ్ సబ్జెక్టులో మొదట 21 మార్కులు వచ్చి ఫెయిల్ అయితే రీవెరిఫికేషన్‌కు అప్లై చేసుకోగా 91 మార్కులు వచ్చాయని తెలిపారు. మరో కామర్స్ విద్యార్థి ఆన్‌లైన్‌లో పేపర్ డౌన్‌లోడ్ చేసుకుంటే మొదట 97 మార్కులు వేసి మళ్లీ 77కు మార్చినట్టు పేపర్‌లో ఉందని పేర్కొన్నారు. ఇంటర్‌మీడియల్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం విషయంలో బోర్డు గతంలో అనేక తప్పిదాలు చేసిందని గుర్తు చేశారు. ఈ నిర్లక్ష్య వైఖరి కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యలకు గురవుతున్నారని తెలిపారు. నిర్లక్ష్యంగా ప్రశ్నా పత్రాలు మూల్యాంకనం చేయడం ద్వారా నష్టపోయిన విద్యార్థులకు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా ప్రశ్నా పత్రాల స్క్రూటినీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతారాహిత్య ఆరోపణలు చేస్తే సహించబోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- కెటిఆర్, మహేశ్వరరెడ్డికి హెచ్చరిక
- మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తనపై బాధ్యతారాహిత్యమైన ఆరోపణలు చేస్తే సహించబోనంటూ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. మాజీ మంత్రి కెటిఆర్, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వరరెడ్డిని హెచ్చరించారు. ఏలేటి బిజెపి అధ్యక్షులు కిషన్‌రెడ్డిని ఓవర్ టేక్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అంత ఓవర్ స్పీడ్ పనికి రాదని ఏలేటిని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. బిజెపి ఫ్లోర్ లీడర్ మహేశ్వరరెడ్డిని తామే పెంచి పోషించామని తెలిపారు. ఇప్పుడేమో అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి డబ్బులు పంపి ఫ్లోర్ లీడర్ పదవి కొనుక్కున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కెటిఆర్, మహేశ్వరరెడ్డి తెలిసి తెలియకుండా ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్, బిజెపి కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. సివిల్ సప్లయ్ శాఖపై అబద్ధాలు, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నయ పైస నిజం లేదని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ రూ.58 వేల కోట్లు అప్పులు చేసిందని తెలిపారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో కూడా రూ.11 వేల కోట్ల అప్పులు చేసిందని వివరించారు. గత ప్రభుత్వం కంటే తామే ముందుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎంఎస్‌పి ధరకు కొనాలని రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎంఎస్‌పి ధరకు కొన్న ఏకైక ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే ఆ రెండు పార్టీలు మాట్లాడుతున్నాయని ఆరోపించారు. మిల్లర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూనే, వారే మిలర్లను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం చర్చించే సంస్కారం తమది కాదని స్పష్టం చేశారు. మిల్లర్ల దగ్గర డబ్బులు తీసుకోవడం కాదు కదా? కనీసం వాళ్లను తాను ఇప్పటివరకు కలవలేదన్నారు. తన లాంటి నిజాయితీ పరుడిపై ఇష్టమెచ్చినట్టు మాట్లాడటం సరైంది కాదని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సన్న బియ్యం ఒక్క గింజ కూడా కొనలేదన్నారు. టెండర్ నిబంధనల ప్రకారం ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుందని స్పష్టం చేశారు. మిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం తమదేనని వివరించారు. తప్పు చేసిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

బిజెపికి ఓటమి తప్పదు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఓడిపోతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గునిగంటి రాజన్న అధ్యక్షతన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నాగయ్య మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఓడిపోతుందని, ఈ భయం నుంచే బిజెపి, మోడీ దిగజారి హిందువులను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అయినా ప్రజలు బిజెపిని ఓడిస్తున్నారని అన్నారు. ఉత్తర భారతదేశంలో బిజెపి గణనీయంగా సీట్లు కోల్పోతుందని, బిజెపి గ్రాఫ్ తగ్గుతుందని తెలిపారు. వామపక్ష పార్టీలు అనేక స్థానాలు గెలిచి బలమైన శక్తిగా పార్లమెంట్‌లోకి రాబోతున్నాయని తెలిపారు. తెలంగాణలో బిజెపి కలలు కన్నట్టు బిజెపి స్థానాలు పెరిగే అవకాశం లేదని, బిజెపి హిందువులను రెచ్చగొట్టి ఓట్లు, సీట్లు పెంచుకునే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ గెలవడం ఖాయమని అన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ చాలా బలహీన పడే అవకాశం ఉందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విద్యావంతులు, మేథావులు, వామపక్ష వాదులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, సూర్నపు సోమయ్య, అల్వాల వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారామ్, దుద్దెల రామ్మూర్తి, కుర్ర మహేష్, మండ రాజన్న, కుంట ఉపేందర్, ఎం.పాపారావు, గునిగంటి మోహన్, బానోత్ హరి నాయక్, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోహిణి మొదలయ్యే.. ఎండలు ముదిరే..

- జగిత్యాలలో 46.5 డిగ్రీల ఎండ
- మరో రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం
- తీవ్ర ఉక్కపోత.. పలుచోట్ల కురిసిన వర్షం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రోహిణి కార్తె మొదలైంది. ఎండలు ముదిరాయి. నిన్నటిమొన్నటి దాకా చల్లగా ఉన్న వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరువవుతున్నాయి. దీనికి ఉక్కపోత తీవ్రమవుతోంది. జగిత్యాల జిల్లా జైనలో ఆదివారం అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు ప్రస్తుతం నమోదవుతున్న వాటి కంటే రెండు, మూడు డిగ్రీలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. సోమవారం రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే అవకాశమున్న నేపథ్యంలో టిఎస్‌డిపిఎస్ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆ జాబితాలో నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కొమ్రంభీమ్ అసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఆదివారం ఉదయం పూట ఎండ దంచికొట్టింది. అదే స్థాయిలో ఉక్కపోత ఉంది. సాయంత్రం సమయంలో మాత్రం పలుచోట్ల వర్షం కుసింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు 168 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. 24 ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

గాజాపై దాడులు ఆపాలి

- పాలస్తీనా సంఘీభావ సభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుద్ధం అనేది ప్రపంచ మానవాళికి పెనుప్రమాదమనీ, వ్యాపార కాంక్షతో యుద్ధోన్మాదులు చేస్తున్న దాడులను ఖండించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ఆలిండియా తంజీమ్ ఈ ఇన్సాఫ్ (ఐఎన్ఎస్ఏఎఫ్) ఆధ్వర్యంలో 'పాలస్తీనాలో కాల్పుల విరమణ చేయాలి' అనే అంశంపై ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్‌పాషా అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ టెర్రరిజం పేరుతో ఇజ్రాయిల్, పాలస్తీనాపై దురాక్రమణకు పాల్పడటం దారుణమన్నారు. ఇజ్రాయిల్ ఐక్యరాజ్యసమితి సూచనలనూ అతిక్రమించి ఆస్పత్రులు, చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని మూకుమ్మడి దాడులుచేస్తూ,



హత్యలకు పూనుకోవడం శోచనీయమని విమర్శించారు. భారతదేశానికి ప్రధాన మంత్రులుగా పని చేసినవారందరూ పాలస్తీనాతో మంచి సంబంధాలను కొనసాగించారని గుర్తు చేశారు. మోడీ వచ్చిన తర్వాతే ఆ దేశంతో సంబంధాలను సవ్యంగా కొనసాగించడం లేదని చెప్పారు. పాలస్తీనాపై దుష్ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మానవత్వం మరిచి ఇజ్రాయిల్ పాలస్తీనాకు ఆహారం, వైద్యం అందకుండా చేస్తూ తన రాక్షసత్వాన్ని చాటుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అజీజ్‌పాషా మాట్లాడుతూ పేద దేశాలపై అగ్రరాజ్యాలు యుద్ధాలను రుద్దడం ఆపివేయాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాగతాలను, దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి నిబంధనలను గాలికొదిలేసిన పెద్ద దేశాలు.. పేద దేశాలను బలితీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యుద్ధాలను ఆపేసి పాలస్తీనా ప్రజలకు ఆహారం, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పాషా డిమాండ్ చేశారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ అమెరికా లాంటి అగ్రదేశాలకు కీలుబొమ్మగా మారిన ఇజ్రాయిల్, వారి యుద్ధకాంక్షకు అనుకూలంగా అమాయక ప్రజలను హత్యలు చేయటం అనాగరికమని విమర్శించారు. నగరాలను, పౌరులను లక్ష్యంగా చేసుకుని అది విధ్వంసం సృష్టిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్ తమ యుద్ధాన్ని ఆపాలనీ, శాంతి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా తంజీమ్ ఇ ఇన్సఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి ఫయాజ్, మునీర్ పటేల్, సయ్యద్ జలాలుద్దీన్, పాల్గొన్నారు.

సర్కార్ బడులకు ఉచిత విద్యుత్తు...

- చెట్ల పెంపకం, మరుగుదొడ్లకు నీటి కోసం మోటార్ల వాడకం
- పెరిగిన కంప్యూటర్స్, ల్యాబ్స్, ఫ్యాన్స్ ప్రొజెక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్కార్ బళ్ల నిర్వహణ భారం పెరుగుతోంది. పాఠశాలల నిర్వహణలో కరెంట్ బిల్లు భారమే అధికంగా ఉంటుంది. ఆ భారం ఇక నుంచి తగ్గనుంది. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాఠశాలల నిర్వహణ ఖర్చుల భారం తగ్గనుంది. ప్రతి ఏటా ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్వహణ ఖర్చుల కోసం నిధుల్ని కేటాయిస్తారు. ఆ నిధులు స్టేషనరీ, మొక్కల పెంపకం, కరెంట్ బిల్లు, కంప్యూటర్స్, ల్యాబ్ మెయింటెనెన్స్, చాయ్ బిస్కెట్స్ వంటి ఖర్చులకు చాలని పరిస్థితి. కరెంట్ బిల్లే రూ.రెండు వేల నుంచి ఏడు వేల వరకు వచ్చిన పాఠశాలలున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉచిత కరెంట్ సరఫరా చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల వారీగా ఫిబ్రవరికి ముందున్న పెండింగ్ బిల్లులు, ఫిబ్రవరి, మార్చిలో వచ్చిన కరెంట్ బిల్లుల వివరాల్ని సేకరించింది. ఈ మేరకు ఎంఆర్‌పిలు, సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల వారీగా కరెంట్ బిల్లుల వివరాల్ని విద్యాశాఖకు సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖకు కూడా ఆదేశాలు అందాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత కరెంట్ వర్తించనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం ఏటా ఇచ్చే కొద్దిపాటి నిధులతో కరెంట్ బిల్లుల చెల్లింపు భారంగా ఉండేది. చాలా పాఠశాలల్లో కరెంట్ బిల్లులు కట్టకపోవడం వల్ల విద్యుత్ శాఖ వడ్డీ భారం వేసేది. కొన్ని చోట్ల విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన సందర్భాలు ఉన్నాయి.

41360 పాఠశాలలకు ఉచిత కరెంట్

రాష్ట్ర వ్యాప్తంగా 41360 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3277 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 1239 ప్రభుత్వ పాఠశాలలుండగా.. వీటిల్లో 848 ప్రాథమిక పాఠశాలలు, 192 ప్రాథమికోన్నత, 208 ఉన్నత పాఠశాలలున్నాయి. సిద్దిపేట జిల్లాలో 976 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో 636 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలలున్నాయి. మెదక్ జిల్లాలో 1062 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిల్లో 637 ప్రాథమిక, 183 ప్రాథమికోన్నత, 243 ఉన్నత పాఠశాలలులున్నాయి. వీటన్నింటికీ 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఉచిత కరెంట్ అందనుంది. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎఎ పాఠశాలలో ఎంత కరెంట్ బిల్లు వస్తుందనే వివరాలు విద్యుత్ శాఖకు అందాయి. దీంతో జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాలలకు ఇక నుంచి కరెంట్ బిల్లులు కట్టాల్సిన అవసరముండదు.

తగ్గనున్న పాఠశాలల నిర్వహణ భారం

పాఠశాలల నిర్వహణలో కరెంట్ బిల్లుల చెల్లింపు తప్పినందున కాస్త భారం తగ్గనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆయా పాఠశాలలకు అందులో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను బట్టి నిధుల్ని కేటాయిస్తుంది. ఒక్కో పాఠశాలకు రూ.పది వేల నుంచి 75 వేల వరకు వస్తాయి. రూ.50 వేల నుంచి ఆ పైన నిధులు వచ్చే పాఠశాలలు నామమాత్రంగానే ఉన్నాయి. అత్యధిక పాఠశాలలకు తక్కువ నిధులే వస్తాయి. ఏటా రెండు విడతల్లో మెయింటెనెన్స్ ఫండ్స్ ఇస్తారు. వాటితోనే పాఠశాలల నిర్వహణ చేయాలి. స్టేషనరీ, చెట్ల పెంపకం, కంప్యూటర్స్, ల్యాబ్ నిర్వహణతో పాటు కరెంట్ బిల్లులు కట్టాల్సి ఉండేది. హరితహారం కింద పాఠశాల మైదానంలో చెట్లను పెంచారు. వాటి సంరక్షణ నిమిత్తం, మరుగుదొడ్ల అవసరాల కోసం కరెంట్ మోటర్ వాడుతున్నారు. కంప్యూటర్లు, ప్రయోగశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయులు, సిబ్బంది గదుల్లో ఫ్యాన్స్, డిజిటల్ తరగతి గదుల్లో ప్రొజెక్టర్ వాడుతున్నారు.

'మన ఊరు-మన బడి' కింద ఎంపికైన పాఠశాలలకు ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు అందజేశారు. దీంతో కరెంట్ బిల్లు రూ.2 వేల నుంచి 7 వేల వరకు వస్తున్న పాఠశాలలున్నాయి. వీటన్నింటికీ ఇక నుంచి కరెంట్ బిల్లుల భారం తప్పనుంది. మరోపక్క గతంలో మెయింటెనెన్స్ నిధులు రాకపోవడం, ఆలస్యంగా రావడం, వచ్చినా నిర్వహణకు సరిపడకపోవడంతో కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. ఆ బిల్లులకు విద్యుత్ శాఖ వడ్డీ వేసి వసూలు చేసేది. ఇక నుంచి కరెంట్ బిల్లు బాధే కాదు వడ్డీ భారం కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు.

అప్పుల భారం.. బతుకులు ఛిద్రం !

- ఆత్మహత్యలే శరణ్యమంటున్న వైనం
- నింగినంటిన నిత్యావసర సరుకుల ధరలు
- చదివిన చదువుకు ఉపాధి లేదు.. చేసి పనికి సరైన వేతనం లేదు..
- దెబ్బతింటున్న నిరుద్యోగుల ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కుటుంబాన్ని పోషించే క్రమంలో అవసరానికి కావాల్సిన ఆర్థిక వనరులు అందులోబాటులో లేవు. అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయి. చదివిన చదువుకు సరైన పనులు దొరకడం లేదు. ఏమీ చేయలేని దుస్థితి. ఆర్థిక లోటు పాట్లు, హెచ్చుతగ్గులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల వరంగల్ నగరంలో ఓ నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటనను చాలామంది నిరుద్యోగులు గుర్తు చేసుకుంటూ మదన పడుతున్నారు. ఉపాధి మార్గాలు చూపేలా ప్రభుత్వాలు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరంగల్ నగరంలోని 14వ డివిజన్ ఎన్‌టిఆర్‌నగర్ కాలానికి చెందిన సారెకొక్కు అశోక్ నిరుద్యోగి. కుటుంబ పోషణ కోసం లారీ డ్రైవర్‌గా పని చేస్తూనే ఉద్యోగ అన్వేషణలో ఉన్నారు. ఉన్నత చదువులు చదివిన ఆయన మూడు నెలల కిందట డ్రైవర్ వృత్తి వదిలి కానిస్టేబుల్ ఉద్యోగం కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుని పరీక్ష రాశారు. అయినా ఉద్యోగం సాధించలేకపోయారు. ఇదే క్రమంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోవడంతో దిక్కుతోచని స్థితిలో అప్పులు చేశారు. తిరిగి చెల్లించే స్థోమత లేక.. అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి భరించలేక మానసికంగా కుంగిపోయి చివరికి ప్రాణం తీసుకున్నారు. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ పెద్దదిక్కు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబమంతా రోడ్డున పడింది. అతనికి ఇద్దరు పిల్లలు. ఇది ఈ ఒక్క కుటుంబ పరిస్థితే కాదు నిరుద్యోగులందరినీ వెంటాడుతున్న దుస్థితి.

ఉపాధి రంగంపై చిన్నచూపే కారణమా ?

కూరగాయలు, వంట సరుకులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సగటు మధ్యతరగతి కుటుంబం అనుకున్న స్థాయిలో కుటుంబ పోషణ ఉండటం లేదు. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. మరోవైపు ఉపాధి లేక.. చేసిన పనికి సరైన వేతనం లభించక దినదినగండంగా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న అప్పులు ఆత్మహత్యల వైపు దారి తీస్తున్నాయి. నిరుద్యోగులను ఆదుకుంటామని గత ప్రభుత్వం ఎన్నో ఆశలు చూపింది. ప్రస్తుత ప్రభుత్వం అయినా నిరుద్యోగులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కేంద్రం వైఖరిపై యువత ఆగ్రహంగా ఉంది. ఉద్యోగావకాశాలు మెరుగు పర్చడంతోపాటు ఉపాధి రంగాల్లోని ఇలాంటి కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారంగా మారుతోంది : ప్రియాంక, బాధితురాలు

పలుమార్లు ఉద్యోగ అన్వేషణలో పోలీస్ కానిస్టేబుల్, డ్రైవర్ ఉద్యోగానికి నా భర్త అశోక్ పరీక్ష రాశారు. ఉద్యోగం రాకపోవడంతోపాటు అప్పుల భారం అధికం కావడంతో మనస్తాపం చెందారు. 45 రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి మరింత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇద్దరు పిల్లల్లో ఒకరు మూడో తరగతి, మరొకరు యూకేజీ చదువుతున్నారు. పిల్లలను చదివించడానికి, ఇతరత్రా ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఏదైనా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించించి, మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

ఉపాధి అవకాశాలు కల్పించాలి
నలిగంటి రత్నమాల, సిపిఎం జిల్లా నాయకులు

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఉన్నత చదువులు చదివి ఉపాధిలేక చాలా మంది నిర్మాణ కార్మికులుగా, ఆటో డ్రైవర్లుగా పనులు చేస్తున్నారు. కొంతమంది హైదారాబాద్ వంటి నగరాలకు వలసలు వెళుతున్నారు. పనికి తగ్గ వేతనం అందక పోయేసరికి ఆర్థికంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు తెచ్చి గడుపుతున్నారు. చివరికి అప్పుల భారంతో కుంగిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆత్మహత్యలను నివారించాలి.

‘ప్రయివేటు’లో ఉచిత విద్య..!

- స్కూల్స్, కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలు
- బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా అవకాశం
- సద్వినియోగం చేసుకుంటే పేద విద్యార్థులకు లబ్ధి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఎరుకల, ఇతర ఉప-కులాలు, పేద దళిత విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో 3 నుంచి పదో తరగతి వరకు, ‘పది’ పూర్తయిన వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇబిసి విద్యార్థులకు ఇంటర్‌లో కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే, వారికి ఉచితంగా ప్రయివేటు పాఠశాలల్లో ‘పది’ వరకు, కాలేజీల్లో ఇంటర్ వరకు ఉచితంగా చదువుకునేందుకు అవకాశం దక్కుతుంది.

సీట్ల కేటాయింపు ఇలా..


2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకం ద్వారా ప్రవేశాలకు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జిల్లాకు మొత్తం 46 సీట్లు కేటాయించగా, అందులో 3వ తరగతిలో 22 సీట్లు, 5వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు ఉన్నాయి. దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. దరఖాస్తు ఫారాలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి.

దరఖాస్తులు ఇలా..

దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతోపాటు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇతర వివరాలకు 9959159629 నెంబరులో సంప్రదించవచ్చు. ఇక 2024-25లో బెస్ట్ అవేలబుల్ స్కూల్ (డే స్కాలర్) పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కోసం 5, 6 ఏళ్లలోపు షెడ్యూల్డ్ కులాల బాల బాలికలను నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. 1వ తరగతిలో ప్రవేశాల కోసం చింతల్‌లోని ఆర్‌ఎస్‌కె ఉన్నత పాఠశాల, కుషాయిగూడలోని బ్రిల్లియంట్ గ్రామర్ హైస్కూల్, కూకట్‌పల్లిలోని బ్రిల్లియంట్ గ్రామర్ హైస్కూల్, బోడుప్పల్‌లోని పద్మశ్రీ ఉన్నత పాఠశాలలో సీట్లు కేటాయించారు.

వీరు అర్హులు..

దరఖాస్తుదారులకు మీ-సేవా ద్వారా మేడ్చల్ నెటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. మల్కాజిగిరి జిల్లాకు చెందిన వారై ఉండాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికైతే రూ.లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాల వారికైతే రూ.2 లక్షల లోపు ఉండాలి. ఒక్క కుటుంబం నుంచి ఒక్క విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుంది.



విద్యార్థి వయస్సు 1-6-2014 నాటికి 5-6 ఏండ్లు కలిగి ఉండాలి. కులం, ఆదాయం మీ-సేవా ద్వారా పొంది ఉండాలి. ఈ నెల 18 నుంచి జూన్ 7వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి.

కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ కోసం..

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 7 జీపీఏకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కేజీబీవీ, నదోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవేలబుల్ పథకం కింద చదివిన వికలాంగ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇబిసికి చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించారు. కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివే విద్యార్థుల ఫీజును ప్రభుత్వం ఆయా కాలేజీల యాజమాన్యాలకు చెల్లిస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

ఇంటర్‌లో కార్పొరేట్ కాలేజీల్లో చేరేందుకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి వివరాలను, పదో తరగతిలో సాధించిన జిపిఎ, సెల్ నెంబర్, ఈ మెయిల్ ఐడి, కులం, ఆదాయం, నివాస, వికలాంగ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాల్సి ఉంటుంది. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలలకు చెందిన బోనఫైడ్లు, ఫొటోను సైతం వెబ్‌సైట్‌లో అప్ లోడ్ చేయాలి. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తొలి జాబితాను జూన్ 3వ తేదీన ప్రకటించి, జూన్ 6వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. ఎంపికైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం
: వినోద్‌కుమార్, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఈ బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకాన్ని జిల్లాకు చెందిన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి. మిగతా వివరాలకు కేటాయించిన ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి కనుక్కోవచ్చు. లక్కీ డ్రా, మార్కుల ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తాం.

‘డబుల్’ ఇళ్లకు సౌకర్యాలు కల్పించాలి

- హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కరెంట్, మంచినీరు, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2 బిహెచ్‌కె ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సిఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2 బిహెచ్‌కె ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.విజయ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఇప్పటి వరకు కరెంటు, మంచినీళ్లు, లిఫ్ట్ వంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. సౌకర్యాలు కల్పించకుండా ఇళ్లు ఇచ్చామని చెప్పుకుంటే పేదలు వాటిలో ఎలా ఉంటారని ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు.

ముషీరాబాద్ జోన్ నుండి అహ్మద్ గూడలో కేటాయించబడిన వారికి కనీస వసతులు కల్పించి, లబ్దిదారులకు ఇండ్లు అప్పగిస్తున్నారని, మిగిలిన ప్రాంతాల్లోనూ వెంటనే పనులు పూర్తి చేసి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 10 నాటికి ఈ కనీస సౌకర్యాల కల్పన ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నామని, లేనియెడల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారులతో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సదస్సుకు హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం నాయకులు ఆర్.వెంకటేష్, కె.రమేష్, డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

పంటల మద్దతు ధరలపై బిజెపి దగా

- రైతు సంక్షోభానికి మోడీ సర్కార్ విధానాలే కారణం
- వెబినార్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త అల్దారి జానయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్దతు ధరలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ అల్దాఫ్ జానయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో “పంటల మద్దతు ధరల్లో శాస్త్రీయత ఎంత?” అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారుల మేరకు మద్దతు ధరలు దేశంలో ఇప్పటికి అమలు కావడం లేదని వ్యాఖ్యానించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు చెల్లిస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ఉత్పత్తి ఖర్చు, రైతుల సేవలతోపాటు రెంటల్ తదితర వ్యయాలకు అదనంగా 50 శాతం జోడించి మద్దతు ధర నిర్ణయించాలని కమిషన్ సూచిస్తే కేవలం మొదటి రెండింటిని మాత్రమే బిజెపి సర్కార్ అమలు చేసిందని విమర్శించారు. మద్దతు ధర విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానంలో శాస్త్రీయత పూర్తిగా లోపించిందని గుర్తు చేశారు. ఫలితంగా గత పదేళ్లలో మద్దతు ధర 6 నుంచి 7 శాతం పెరిగితే, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, కూలీలు, డీజిల్ తదితర వస్తువుల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగాయని తెలిపారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు పెంచితే ప్రస్తుతం వరికి క్వింటాలుకు రూ.2,183గా ఉన్న మద్దతు ధర రూ.3,160కి పెరిగేదని గుర్తు చేశారు. బిజెపి సర్కార్ చేసిన నిర్వాకం వల్ల రైతులు ఎకరానికి దాదాపు వెయ్యి వరకు నష్ట పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రైతు సంక్షోభాన్ని నివారించాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడం, విద్య, వైద్య రంగాలను పూర్తిగా పబ్లిక్ సెక్టార్‌లో నడపడం, రైతులకు సబ్సిడీలను విరివిగా అందించడం లాంటి చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. అలాగే వ్యవసాయ సంబంధిత ఉత్పత్తి పరిశ్రమలకు ప్రోత్సాహకాలను అందించాలని పేర్కొన్నారు. ఆలిండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ పంటల మద్దతు ధరను నిర్ణయించడంలో మోడీ సర్కార్ శాస్త్రీయత పాటించడం లేదని విమర్శించారు. కమిషన్ ఆఫ్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్(సీఏసీపీ) సిఫారసులకు అదనంగా 50 శాతం వ్యయాన్ని జోడించాల్సి ఉండగా, వాటిని తగ్గించి మొక్కుబడిగా ఏటా వంద, యాభై పెంచుతున్నారని ఆరోపించారు. ప్రముఖ ఆర్థిక వేత్త గులాటి మాటల్లో చెప్పాలంటే దేశంలో ప్రతి ఏటా 18 లక్షల కోట్ల టన్నుల పంట మార్కెట్‌కు వస్తుండగా 4 లక్షల కోట్ల టన్నుల పంటను మధ్య ధళారులు లూటీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వెబినార్‌కు ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

బిఆర్‌ఎస్ బ్యాంకు ఖాతాను నిలిపివేయండి

- ఇసికి రఘునందన్‌రావు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు బిఆర్‌ఎస్ పార్టీ తన అధికారిక బ్యాంక్ ఆఫ్ బరోడా అకౌంట్ నుంచి 34 మంది ఇన్‌చార్జులకు రూ.30 కోట్లను బదిలీ చేసిందని బిజెపి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు బ్యాంక్ అకౌంట్ డిటైల్స్‌తో కూడిన లేఖను ఇసికి, రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ అకౌంట్ నుంచి బదిలీ చేసిన డబ్బులను ఫ్రీజ్ చేయాలని ఇసిని కోరారు. లేకపోతే ఆ డబ్బులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కొనుగోళ్లకు వాడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

- తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకాన్ని చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,804 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అవుట్ సోర్సింగ్ సర్వీస్ పర్సన్స్ (స్కావెంజర్)ను తొలగించి ఆ బాధ్యతలు స్థానిక గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు చేపట్టాలని గత ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అనేక కారణాల చేత ఈ నిబంధన ఆచరణ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రజా పాలనలో పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అభివృద్ధి పనులతో పాఠశాలలు కొత్త శోభను సంతరించుకోబోతున్న సందర్భంలో స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

స్కావెంజర్లను నియమించాలి : పిఆర్‌టియు

బడిబాట జూన్ ఒకటి నుంచి, 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వెంటనే స్కావెంజర్లను నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం చెన్నయ్య, సుంకరి భిక్షంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడిబాటకు ముందే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. ఆగిపోయిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఎక్కువగా మాట్లాడితే పెద్ద లీడర్ అవ్వరు

- ఏలేటికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సలహా

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో ఎక్కువగా మాట్లాడితే పెద్ద లీడర్ అవ్వరనీ, వాస్తవాలు మాట్లాడితేనే లీడర్ అవుతారని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వరరెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సలహా ఇచ్చారు. మహేశ్వరరెడ్డికి ఇంత బుద్ధి వచ్చిందా? బిజెపిలోకి వెళ్ళగానే వాళ్ళ తప్పులు ఒప్పులుగా మారాయా? లీడర్ కావాలని కోరికతో నిజాలను దాస్తావా? అని ప్రశ్నించారు. పేపర్లో పేరు వస్తే చాలు అన్న తీరులో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తడిచిన ధాన్యాన్ని కొన్న ప్రభుత్వం ఏదైనా ఉందా? సివిల్ సప్లయ్ శాఖ ఇంత అప్పుల్లోకి పోవడానికి కేంద్ర ప్రభుత్వం కారణం కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ధాన్యం సగటు ధర రూ.1700 మాత్రమే, ఇప్పుడు రూ.2022 ఉందన్నారు. మిల్లర్లు చేస్తున్న తప్పుకు ప్రభుత్వాన్ని బదనాం చేస్తారా? అని ప్రశ్నించారు. ‘ఐదేండ్లలో కెసిఆర్ రుణమాఫీ చేయలేదు. మేం ఐదు నెలల్లో చేయబోతున్నాం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తున్నారా?’ అని ప్రశ్నించారు.

భూముల ధరలకు రెక్కలు

- మహబూబాబాద్ జిల్లాలో భారీగా రెక్కలు
- గజం రూ.5000 నుంచి రూ.50 వేల వరకు..
- అందని ద్రాక్షగా పేదల కల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అని పెద్దలు ఊరికే అనలేదు. ఈ రెండింటికి ప్రధానంగా కావాల్సింది ఒకటి భూమి, రెండవది బంగారం. పాలకవర్గాల పుణ్యమా అని ఈ రెండు వస్తువులు సామాన్య, మధ్యతరగతి పేదలకు అందని ద్రాక్షగా మారింది. ఈ దశాబ్ద కాలంలో బంగారం, భూముల ధరలు ఏకంగా 500శాతం పెరిగాయని విశ్లేషకుల అంచనా. దశాబ్ద కాలం కిందట గజం భూమి రూ.200 నుంచి రూ.300కు లభిస్తే నేడు వేలు, లక్షల్లో పలుకుతోంది. ఇక బంగారం 2014లో తులానికి రూ.15000 ఉంటే నేడు రూ.75 వేలకు చేరింది. దీంతో సామాన్య ప్రజలకు భూములు, బంగారం అందని ద్రాక్షగా మారాయి. ఇందుకు మహబూబాబాద్ జిల్లానే నిదర్శనం.మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 3.20 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా 1.80 లక్షల మంది రైతులు ఉన్నారు. జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా గజం రూ.5000 మొదలు కొని రూ.50వేల వరకు పలుకుతోంది. ఇక సాగుభూములు ఎకరం రూ.50 లక్షలకు పైనే ఉంది. దాంతో మహబూబాబాద్ జిల్లాలో సామాన్యుడు ఇల్లు కట్టాలంటే తక్కువలో తక్కువ రూ.50 లక్షలు ప్లాటుకు, రూ.50 లక్షలు గృహ నిర్మాణానికి మొత్తంగా రూ.కోటి ఉంటే తప్ప ఇల్లు కట్టలేని పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 15,893 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా రూ.36,51,71,000ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. మహబూబాబాద్ పట్టణంపై ఖమ్మం, ఇల్లందు, కొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు ఇతర దేశాల్లో నివాసమున్న ఎన్నారైలు కన్నేసి అడ్డీకి పావుసేరుకు కొని అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. పదేండ్ల కిందట రూ.మూడు లక్షలకు ఎకరం కొన్న భూమి నేడు రూ.50 లక్షలు పలుకుతోంది. 2014కు ముందు 200, 300కు గజం కొనుగోలు చేస్తే.. బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చాక భూముల ధరలకు రెక్కలు వచ్చి.. ఈరోజు రూ.20,000 నుంచి రూ.30,000 పలుకుతోంది. 2014కు ముందు ఉన్న అసైన్‌మెంట్ కమిటీలు రద్దు చేయడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. కమిటీలు ఉన్నపుడు నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యే చైర్మన్‌గా ఆర్‌డిఓ కన్వీనర్‌గా ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సభ్యులుగా అసైన్డ్ కమిటీలు ప్రతినెలా సమావేశమై ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములుగా పంపిణీ చేసేవారు. కేసీఆర్ హయాంలో అసైన్‌మెంట్ కమిటీలను ఎత్తివేశారు. అరకొరగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనూ ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో పేదలకు చెందిన భూములు సగానికి పైగా సంపన్నుల పేర్లపైకి మారిపోయినట్టు తెలుస్తోంది. దీనికి తోడు భూముల రేట్లు పెరగడం, రిజిస్ట్రేషన్ రుసుం పెరగడం పాలక విధానాలతో పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది.

సెంటు భూమి పంచని బిఆర్‌ఎస్, బిజెపి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు సెంటు భూమి పంచిన దాఖలాలు లేవు. అంతకంటే ముందు కేంద్రంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఉన్న ప్రభుత్వాలు నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు సాగుభూములు, ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే ఆనవాయితీ కొనసాగింది. కానీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక భూ పంపిణీకి తిలోదకాలిచ్చింది. 2014 ఎన్నికలకు ముందు కెసిఆర్.. దళితులకు మూడెకరాల భూమి, ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి ఓట్లు దండుకుని అధికారంలోకొచ్చి విస్మరించారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్.. ప్రతి పేద కుటుంబానికి గృహానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చింది.

రియల్ వ్యాపారం వదిలి వేద్దామనుకుంటున్న
: లాదినేని శ్రీధర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి

15 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న. గతంలో నెలకు ఐదు నుంచి పది ప్లాట్లు విక్రయించే వాడిని. నేడు మూడు నెలలకు ఒక ప్లాట్ కూడా అమ్మలేని పరిస్థితి ఉంది. గతంలో రూ.50, రూ.60 లక్షల పెట్టుబడి ఉంటే సరిపోయేది. రెండు మూడు ఎకరాలు కొనుక్కొని ప్లాట్లు చేసి ఇద్దరు ముగ్గురం కలిసి విక్రయించేవాళ్లం. నేడు ఎకరం కోటి నుంచి రెండు కోట్లు పలుకుతుంది. పెట్టుబడి పెట్టలేని పరిస్థితి నెలకొంది. కొనుగోలుదారులు కూడా ముందుకు రావడం లేదు.

16 ఏండ్ల నుంచి పని చేస్తున్నా ఇంటి స్థలం లేదు
: ఎండి ఉస్మాన్, కార్మికుడు

పొట్ట చేత పట్టుకొని మానుకోటకు వలస వచ్చాను పదహారేళ్లుగా హమాలీ, భవన నిర్మాణ కార్మికునిగా, అడ్డా కూలీగా పనిచేశాను. 100 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుందాం అంటే డబ్బులు సరిపోని పరిస్థితి నెలకొంది. ఏటేటా పెరుగుతున్న ధరలతో భూములు కొనలేని పరిస్థితి ఉంది.



మేడిగడ్డలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

- ఏడవ బ్లాకులో మరింత కుంగుబాటుకు గురైన పిల్లర్లు
- పిల్లర్ల ఎగువ, దిగువ భాగంలో ఏర్పడ్డ బుంగలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనుల్లో రోజుకో సమస్య ఏర్పడి అధికారులను ఇబ్బంది పెడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ గతేడాది కుంగుబాటుకు గురయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుపై విచారణ చేపట్టి సమస్యలపై నిపుణుల సలహాల మేరకు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ ఇఇ తిరుపతిరావు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడవ బ్లాకులోని 17, 18, 19, 21 గేట్లను పూర్తిగా తొలగించాలని ఎన్‌డిఎస్‌ఎ అధికారుల సూచనల మేరకు పనుల నిర్వహణలో భాగంగా ఆదివారం ఏడో బ్లాకులో వెల్డింగ్ పనులు చేపట్టి గేట్లను తొలగించినట్టు తెలిపారు. బ్యారేజీ గేట్ల దిగువన సిసి బ్లాక్‌ల పనులు నిర్వహిస్తున్నారని అన్నారు. 7వ బ్లాక్‌లో నీటి ప్రవాహం రాకుండా కాఫర్ డ్యామ్ నిర్మించి నీటిని మళ్లిస్తున్నామని, షీట్ ఫైల్స్‌కు సంబంధించి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బోర్వెల్ సహాయంతో బొరియలు ఎంత మేరకు ఏర్పడ్డాయో పరిశీలిస్తున్నారు. కాగా, జియో ఫిజికల్, జియో టెక్నికల్, టెస్టు అనంతరం పూర్తి మరమ్మతులు చేపట్టాలని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ ఫిల్లర్లు కుంగడంతో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని ఎన్‌డిఆర్‌ఎస్‌ఎ నిపుణుల బృందం పేర్కొంది. దీంతో, మొదటి దశ కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి జరగాల్సి ఉంది. ప్రాణహిత నది ద్వారా వచ్చిన ప్రవాహం గోదావరిలో కలిశాక నీటిని ఎత్తిపోయాలి.. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జియో ట్యూబులను ఏర్పాట్లు చేస్తున్నారు. మేడిగడ్డ పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వారం రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్టు సమాచారం.

గుట్టలుగా పేరుకుపోతున్న దొడ్డు బియ్యం

- వినియోగం తక్కువ... దిగుబడి ఎక్కువ
- ఏటా పెరుగుతున్న దొడ్డు ధాన్యం సాగు
- సిఎంఆర్‌లో 98 శాతం అవే
- సన్నాల వైపు మళ్లిచ్చేందుకు సర్కార్ యత్నాలు
- రూ.500 బోనస్ ఫలితమిచ్చేనా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా భారీగా దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రతి సీజన్లో రాష్ట్రంలోని రైతులు పెద్ద మొత్తంలో దొడ్డు రకం వడ్లను సాగు చేస్తున్నారు. దీంతో వాటి నిల్వలు పెరిగిపోతుండగా, అటు సన్న రకాలకు కొరత ఏర్పడుతోంది. వీటి మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాలను ప్రోత్సహించాలని నిశ్చయించింది. వచ్చే సీజన్ నుంచి సన్న వడ్లకు ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ఏ మేరకు ఫలితమిస్తుందో వేచి చూడాలి.

డిమాండ్, సప్లై అధారంగా నడిచే నేటి మార్కెట్ ప్రపంచంలో అయితే అతి వృష్టి, లేకుంటే అనావృష్టి... ఏ సరుకుల ధరలు ఎప్పుడు పాతాళానికి పోతాయో... ఎప్పుడు ఆకాశాన్నంటుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మార్కెట్లో సన్న బియ్యం రేట్లు వినియోగదారులకు అందనంతగా పెరిగిపోతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ రెండు పంట సీజన్లలోనూ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ద్వారా సేకరించిన బియ్యాన్ని రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాలకు ప్రభుత్వం వినియోగిస్తున్నది. ఒకవైపు రైతుల నుంచి సేకరించిన దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతుంటే, మరో వైపు సన్న బియ్యం కోటా మన రాష్ట్ర పంపిణీ అవసరాలకు కూడా సరిపోవటం లేదు. రేషన్ షాపుల ద్వారా (రాష్ట్ర ప్రభుత్వ కార్డులు, జాతీయ ఆహార భద్రత కార్డుల కింద) ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరం. (36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సమానం) ఇటీవల దొడ్డు బియ్యం తినేందుకు రేషన్ కార్డుదారులు ఇష్టపడటం లేదు. చాలా చోట్ల వీటిని అమ్ముకుంటున్న ఉదంతాలున్నాయి. అందుకే సన్నాల సాగు పెరిగితే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా కూడా ఈ బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రాష్ట్ర సివిల్ సప్లయిస్ విభాగం ఏటా సేకరిస్తున్న బియ్యంలో 98 శాతం దొడ్డు రకాలు ఉండగా, కేవలం రెండు శాతం మాత్రమే సన్న రకాలు ఉంటున్నాయి. దొడ్డు రకంతో పోలిస్తే సన్న ధాన్యాల దిగుబడి కొంత తగ్గుతుంది. అందుకే రైతులు దొడ్డు రకం ధాన్యం ఎక్కువగా సాగు చేస్తున్నారు. గడిచిన రెండేండ్లలో దొడ్డు బియ్యం సాగు భారీగా పెరిగిపోయి సన్న ధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోయింది. కానీ మార్కెట్లో సన్న రకాల డిమాండ్, వినియోగం ఎక్కువగా ఉంది. అందుకే ధరలు రోజు రోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో సన్న రకాల వరి సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహించేందుకు వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి వాటికి రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. సన్నాల సాగుతో రైతులకు వచ్చే దిగుబడి నష్టాన్ని పూడ్చడం వల్ల వారు దొడ్డు వడ్ల సాగు వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని ప్రభుత్వ భావిస్తోంది.